క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావును ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని ఎమ్మెల్సీ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దుకాణాల మూసివేత

అమలాపురం టౌన్: స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ సర్క్యులర్ బజార్ కాంప్లెక్స్‌లో పవన్ స్టిక్కరింగ్ దుకాణదారుడు అరిగెల సుబ్బారావు అనారోగ్యంతో మృతి చెందాడు. అతని మృతికి సంతాపంగా కాంప్లెక్స్‌లోని దాదాపు 55 దుకాణాలు మూసివేసి సంతాపం తెలిపారు. సర్క్యులర్ బజార్ వర్తక సంఘం అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్ ఆధ్వర్యంలో వ్యాపారులు బంద్ పాటించారు. వ్యాపారులంతా సమావేశమై రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు మాతా కామాఖ్య అఖండ హోమం

అమలాపురం టౌన్: స్త్రీకి సంబంధించి మానసిక, శారీరక సమస్యల నివారణకు స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం మాతా కామాఖ్య అఖండ హోమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని హోమ నిర్వాహకులు వేము వెంకట శివకుమార్ శుక్రవారం తెలిపారు. ఈ హోమం 24 గంటల పాటు కొనసాగుతుందని తెలిపారు.

అనధికార చెరువులపై ఫిర్యాదు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం వంతెన ఆనుకుని సుమారు 60 ఎకరాల్లో అనధికారికంగా ఆక్వా సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని ఆ గ్రామానికి చెందిన యువకులు ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డికు శుక్రవారం వినతిపత్రం అందించారు. రెవెన్యూ, మత్స్యశాఖ, డ్రైన్స్, విద్యుత్ శాఖాధికారులు అనధికార ఆక్వా సాగుని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. యంత్రాల సహాయంతో అనధికారంగా చెరువుల వద్ద చేస్తున్న పనులను నిలిపివేయాలని కోరారు. ఆక్వా సాగుతో మత్స్యకారుల జీవనభృతి కరువవుతోందని ఆర్డీఓకి వివరించారు. దీనిపై విచారణ చేయాలని పి.సత్యనారాయణ, మల్లాడి నరేష్, అంగాడి సాయి తదితరులు కోరారు.

పురాతన భవనాలను ఖాళీ చేయించాలి


ఎన్.కొత్తపల్లిలో తుపాను రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

ఉప్పలగుప్తం: మండల గ్రామాల్లో పురాతనమైన తుపాను రక్షిత భవనాలను వినియోగిస్తున్న వారిని ఖాళీ చేయించాలని తహసీల్దారు మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. ఎన్.కొత్తపల్లి గ్రామంలోని తుపాను రక్షిత భవనాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ భవనాల్లో కొన్నింటికి అవసరమైతే మరమ్మతులు చేయిస్తామని ఆయన తెలిపారు. వీఆర్‌వో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి దాసరి కృష్ణాజీ, ఏఎస్ఐ సుబ్బరాజు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మధుమేహం వ్యాధిపై అవగాహన

యానాం: కనకాలపేటలో లయన్స్‌క్లబ్ కాపుల పాలెం గోల్డ్, యానాం లయన్స్‌క్లబ్ పిల్లారాయల సంయుక్త నిర్వహణలో డయాబెటిస్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను మాట్లాడుతూ మధుమేహం లక్షణాలు అకస్మాత్తుగా సంభవిస్తాయని ఆ విధంగా అది క్రమేణా గుండె, కళ్లు, మూత్రపిండాలు, నరాలలోని రక్తనాళాలను దెబ్బతీస్తుందన్నారు. అనంతరం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కాపుల పాలెం గోల్డ్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, కవల గణపతిరావు, ఎస్ఆర్ఎమ్‌టి మూర్తి, కోన దేవ పాల్గొన్నారు.

వీధుల్లో పారిశుధ్య పనులు

యానాం: నియోజకవర్గ పరిధిలో వరదనీరు తగ్గడంతో వీధుల్లో మున్సిపాలిటీ సిబ్బంది పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన పూడిక తొలగించి, బ్లీచింగ్‌ను చల్లారు. దోమలు నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా జీఎంసీ బాలయోగి కాలనీ, ఓల్డ్‌రాజీవ్‌నగర్, ఫెర్రీరోడ్డు తదితర ప్రాంతాలను శుభ్రపరిచినట్టు న్సిపల్ శానిటరీ ఉద్యోగి గూటం రాంబాబు తెలిపారు.

శునకాల స్వైరవిహారం

- గుంపులుగా తిరుగుతూ జనంపై దాడులు
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- కానరాని కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు
- భయాందోళనలో ప్రజలు

అమలాపురం రూరల్: గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వాహనదారుల వెంట పడుతున్నాయి. చిన్నారుల ప్రాణాలను బలిగొంటున్నాయి. రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు జనం భయపడుతున్నారు. పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంత పల్లెల వరకు కునకాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజురోజుకు కుక్క కాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టణంలోని మున్సిపాలిటీతో పాటు గ్రామ పంచాయతీల వరకూ నిధులు ఉన్నా శునకాల నియంత్రణ కాగితాలకే పరిమితమైంది. కనీసం కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కూడా ఎక్కడా కనిపించడంలేదు. అమలాపురం నియోజకవర్గం పరిధిలో పట్టణంతో అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం, మండలాలు, ముమ్మిడివరం నియోజకవర్గంలో ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో కుక్కకాటు బాధితులు సంఖ్య పెరుగుతోంది. రోజుకి సగటున ఒకరిద్దరు కుక్క కాటుకు గురవుతున్నారు. వాహనచోదకులు కుక్కల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా శునకాల నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అమలాపురం పట్టణంలో 6 వేలు, అమలాపురం రూరల్ మండలంలో 8 వేలు, అల్లవరం మండలంలో 7 వేలు, ఉప్పలగుప్తం మండలంలో 5 వేలు కుక్కలు ఉన్నట్టు అంచనా. గ్రామాల్లోని మాంసం విక్రయ కేంద్రాల వద్ద వ్యర్థపదార్థాలు తింటూ మనుషులు, పశువులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.


అమలాపురంలో రోడ్డుపై గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

పెరుగుతున్న కేసులు

రోజురోజుకు కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. అమలాపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో పలు గ్రామాల నుంచి నెలకు సూమారు 160 మంది వైద్యం పొందుతున్నారు. అమలాపురం మండలంలో బండారుంక పీహెచ్ పరిధిలో జనవరి నుంచి జూన్ వరకు 202 కేసులు నమోదయ్యాయి. పేరూరులో పీహెచ్‌సీ పరిధిలో 189 మంది కుక్కకాటుకు గురయ్యారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ పరిధిలో 154 మంది, భీమనపల్లి పీహెచ్‌సీ పరిధిలో 122 మంది, ఎస్.యానాం పీహెచ్‌సీ పరిధిలో 133 మంది, గోడిలంక పీహెచ్‌సీ పరిధిలో 158 మంది, అల్లవరం సీహెచ్‌సీ పరిధిలో 213 మంది, బెండమూర్లంక పీహెచ్‌సీలో 213 మంది కుక్కకాటు గురియ్యారు. అన్ని పీహెచ్‌సీల్లో వంద వరకు ఏఆర్‌వై రేబిస్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల బండారులంకలో 8 మంది పిచ్చికుక్క కాటుకు గురయ్యారు. ఈ గ్రామంలో జనవరి నుంచి జూన్ వరకు వంద మందిపైనే కుక్కకాటు బారినపడ్డారు. అన్ని గ్రామాల్లో నెలలో 10 నుంచి 20 మంది వరకు ప్రమాదానికి గురయ్యారు.

రేబిస్ కుక్కల లక్షణాలివే..

రేబిస్ లక్షణాలున్న కుక్క కరిస్తే మనిషి ప్రాణానికే ప్రమాదం. రేబిస్ ఉన్న కుక్కల నోటి నుంచి చొంగ కారుతుంది. నాలుక బయటపెట్టి మతి లేకుండా తిరుగుతాయి. కనిపించిన వారిని, పశువులను, ఇతర కుక్కలను కరుస్తాయి. అరుపులో మార్పు వస్తుంది. ఇవి 7 నుంచి 10 రోజుల్లో చనిపోతాయి. ఈ జబ్బు వచ్చిన మరి కొన్ని కుక్కలు తినకపోవడం, నిశ్చలంగా ఒక్కటే పడుకుని ఉండడం, పక్షవాతం రావడం తదితర లక్షణాలతో రెండు మూడు రోజుల్లో చనిపోతాయి. దీన్ని మూగ రేబిస్ అంటారు. రేబిస్ కుక్క కరిస్తే వ్యాధి నిరోధక టీకాలు వేయించడం తప్పనిసరి అని వైద్యులు చెప్పతున్నారు.

శస్త్ర చికిత్స చేయాల్సిందే..



సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రామ పంచాయతీలకు కుక్కలను చంపే అధికారం లేదు. 2015 నుంచి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. పశువైద్యుల పర్యవేక్షణలో ఈ శస్త్ర చికిత్సలు చేయాలి. దినికి ప్రత్యేక సిబ్బంది అందుబాటులో లేరు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జి.మల్లికార్జునరావు, ఎంపీడీవో అమలాపురం

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా..



కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. పెద్దలను స్కూల్ పిల్లలపై దాడి చేసి గాయపరిచాయి. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు. దినిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యల్లమిల్లి నాగసుధ కొండ, అజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు, అమలాపురం

పోలీసు స్టేషన్ తనిఖీ


ముమ్మిడివరం పోలీసు క్వార్టర్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ముమ్మిడివరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ రిజిష్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. ముమ్మిడివరం పోలీసు స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తక్షణం ఆధునీకరించాలని ఆదేశించారు. అక్కడ నుంచి పోలీసు కోర్టర్స్, క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌ల కోసం ఏర్పాటు చేసిన భవనాలను పరిశీలించారు. ఆయన వెంట ముమ్మిడివరం ఎస్సై డి.సురేష్ బాబు ఉన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లి నల్లావారి పేటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.7,600, మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసినట్టు తెలిపారు. వారిని కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

అమలాపురం రూరల్: సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని జోనల్ మలేరియా కార్యాలయం రాజమహేంద్రవరం అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ ఎస్.కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన జోనల్ ఎస్‌యూఓ ఎస్వీ రవిశేఖర్, ఉద్యోగులతో కలిసి రెడ్డిపల్లి గ్రామంలో పర్యటించారు. మలేరియా, డెంగీ, కీటక జనిత వ్యాధులు వ్యాప్తి నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జ్వరపీడుతుల వివరాలను సేకరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఎస్‌యూఓలు రాజ్ కుమార్, రాజబాబు, బసవారాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం


బాధితులకు సరకులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఉప్పలగుప్తం: మునిపల్లి పంచాయతీ పరిధి కోటుగట్టు ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన తిరుకోటి సురేష్ కుటుంబానికి శుక్రవారం అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు సాయం అందించారు. బాధిత కుటుంబానికి వంట సామగ్రి, నిత్యావసర సరకులు, దుస్తులు, కూరగాయలను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, నాగాబత్తుల రాజ్‌కుమార్, బళ్ల చినరాజు, దొనిపాటి రాంబాబు, పోలినాటి భీమేష్ అందజేశారు. ఈ సందర్భంగా సాయం సమకూర్చిన రమణారావుకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

శాకంబరిగా దుర్గాదేవి


కూరగాయలతో దుర్గాదేవికి అలంకరణ

అమలాపురం రూరల్: బండారులంక కలోని చొల్లంగివారి పాలెంలో కొలువైన దుర్గాదేవి అమ్మవారు ఆషాఢ శుక్రవారం సందర్భంగా శాకంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని విశేష అలంకారం చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యతోనే ఉన్నత స్థాయి

- డీఈవో కమలకుమారి
- ఎన్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన

ఉప్పలగుప్తం: ప్రతి విద్యార్థి ఆసక్తిగా చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని డీఈవో కమలకుమారి అన్నారు. ఎన్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తరగతులలో విద్యార్థుల పాఠ్య పుస్తకాలను పరిశీలించి జరుగుతున్న తరుగతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు వడ్డించి నాణ్యతను పరిశీలించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి పాఠశాలలో భైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యంపై పట్టు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్య కృష్ణ, హెచ్ఎం బి.రామకృష్ణ, ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఫణి, పీడీ విఘ్నేశ్వరుడు ఉన్నారు.


ఎన్.కొత్తపల్లిలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో కమలకుమారి

వరద నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే అశోక్ విస్తృత పర్యటన

యానాం: గౌతమీ గోదావరి వరదలకు యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల పరంగా జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి నివేదికను పుదుచ్చేరి ప్రభుత్వానికి అందజేయనున్నట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీ పర్యటన ముగించుకుని సరాసరి యానాం చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్ రివర్ బీచ్, కనకాలపేట లంక భూముల కోతతో వరద నీటికి కుంగిపోయిన ప్రదేశాలను, టైడల్‌లాకు ఏరియా ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వరద తగ్గుముఖం పడుతుండడంతో త్వరలోనే వరదనీరు పోతుందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరియాలతిప్ప, పరంపేట, కనకాలపేట తదితర ప్రాంతాల్లో ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములు ముంపునకు గురయ్యాయన్నారు. ముఖ్యంగా గట్లకు పూర్తి స్థాయిలో రింగ్‌బండ్ నిర్మాణం శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం గురించి పీడబ్ల్యూడీ అధికారులతో చర్చించారు. ఇప్పటికే వరదనీరు తొలగిన ప్రదేశాల్లో బ్లీచింగ్‌ను చల్లిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, ఏఈ నాగరాజు, జేఈ జ్యోతిరాజు, ఎస్సై మురుగానందన్, నాయకులు నక్కల సుబ్బన్న, పండు సిద్ధార్థ పాల్గొన్నారు.


వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అశోక్, అధికారులు

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నియంత్రణ

- పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ మనోహర్ సూచన
- వార్డుల్లో పర్యటించిన అధికారులు

అమలాపురం టౌన్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అతిసారం వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పట్టణ ప్రజలకు సూచించారు. 'ఫ్రైడే–డ్రై డే' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ పలు వార్డుల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్లకు పరిశుభ్రమైన తాగునీరు అందుతుందా లేదా అని ఆరా తీశారు. తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో దోమల నివారణపై మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలతో పాటు ప్రజలు వ్యక్తిగతంగా కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 20వ వార్డులో ఏవీఆర్ నగర్, 27వ వార్డులో ఆశానగర్, 28వ వార్డులో దిగువ సావరం ప్రాంతాల్లో కమిషనర్ మనోహర్, మున్సిపల్ డీఈఈ నాగసతీష్, ఏఈలు, పారిశుధ్య అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా అతిసార(డయేరియా) రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


అమలాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు కిట్ల పంపిణీ

అల్లవరం: ప్రభుత్వం అందించిన విద్యా కానుకలను అల్లవారం హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్ఎం నయినాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యా కానుకలు పాఠ్య, నోట్ పుస్తకాలు, షూలు, సాక్స్‌లు, బెల్ట్, యూనిఫాంలను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం అల్లవరం ఉన్నత పాఠశాల నుంచి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి కడలి దివ్య తేజశ్రీని ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ గౌతమి, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ మౌనిక, బండిగుప్తాపు పాండురంగ, విద్యా కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీనివాసరావు, నడింపల్లి సూరిబాబురాజు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తూర్పులంక, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యా కిట్లను అందించారు.

అమలాపురం టౌన్‌లో...

అమలాపురం టౌన్: స్థానిక 13వ వార్డు గొల్లగూడెంలోని అబుల్ కలామ్ అజాద్ (ఉర్దూ) మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యా కానుక పథకం కింద విద్యార్థులకు స్కూలు కిట్ల పంపిణీ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎస్‌కే కరీమ్ ముల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తకంతో నూతన సమాజ నిర్మాణం

యానాం: నూతన సమాజ నిర్మాణం కేవలం పుస్తకంతోనే సాధ్యమవుతుందని ప్రముఖ కవి, కలైమామణి దాట్ల దేవదానం రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో విశాలాంధ్ర మొబైల్ వాహన సంచార పుస్తకాలయ ప్రదర్శనను ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ప్రారంభించారు. అనంతరం దాట్ల దేవదానం రాజు మాట్లాడుతూ దేశంలో ఉన్న భాషలన్నింటిలో తెలుగు అతిపెద్ద భాష అని, వ్యక్తుల ఎదుగుదలలో పుస్తకాలు మెట్లు మాదిరిగా ఉంటాయని అన్నారు. పుస్తకాలయంలో బాలసాహిత్యం, కథలు, కవిత్వం, నవలలు, విమర్శలు, జీవితచరిత్రలు అదేవిధంగా విశాలాంధ్ర ప్రచురణలతోపాటు శాస్త్రసాంకేతికరంగాలకు సంబంధించి ఎమ్‌స్కో, పెంగ్విన్, జైకో, రీమ్, గీతాప్రెస్, భూమిబుక్‌ట్రస్ట్ తదితర అంశాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని మొబైల్ వాహన ఇన్‌చార్జి ఎస్.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు, కవి తాతపూడి సోమశేఖరశర్మ, పానుగుమట్ల అశోక్‌కుమార్, ఎస్.రామమూర్తి పాల్గొన్నారు.


పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన లక్ష్మణ్‌ప్రవీణ్ తదితరులు

సహాయ నిరాకరణతో పథకాల అమలు ఆలస్యం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రభుత్వ కార్యదర్శులు సహాయ నిరాకరణతోనే సంక్షేమ పథకాల అమలు ఆలస్యమవుతున్నాయని స్పీకర్ ఆర్.సెల్వం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలకు నిధులు వస్తున్నాయని ఆ విధంగా జలశక్తి పథకం గతేడాది రూ.33 కోట్లు మంజూరైతే రూ.కోటి మాత్రమే ఖర్చుచేశారన్నారు. లక్షద్వీప్ లాంటి ప్రాంతాల్లో రూ.1500 కోట్లకుపైబడి ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే పుదుచ్చేరిలో అధికారులు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేయడం లేదని తెలిపారు. అటువంటి అధికారుల బదిలీకాకుండా ఉంటున్నారన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పథకాల అమలుకు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తున్నారని వచ్చే రెండేళ్లలో అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. బియ్యం పంపిణీ పథకానికి కేంద్రం రూ.270 కోట్లు కేటాయించిందని, రాష్ట్ర ఋణాన్ని మాఫీ చేయాలని కోరామని రూ.8.16కోట్లను పేపర్‌లెస్ అసెంబ్లీ కార్యకలాపాలకు మంజూరు చేసిందన్నారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరుకు వినతి

యానాం: కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఆర్ఏఓ మునిస్వామికు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్ల నుంచి నూతన రేషన్‌కార్డుల మంజూరు నిలిచిపోయిందని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బీపీఎల్ కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీరప్రాంత గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సత్కారం

అమలాపురం టౌన్: కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన అమలాపురం పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన విశ్రాంత సైనికులకు స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని శ్రీపూర్ణ పుష్కలాంబ సమేత అయ్యప్ప ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఘన సత్కారించారు. ఆలయ ధర్మకర్త గోకరకొండ గంగన్న స్వామి నాయుడు ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికులు జక్కంశెట్టి త్రిమూర్తులు, బీఎస్ఎన్ మూర్తి, ఎంబీ రమణ, ఎన్ఎస్ నారాయణ, ఎం.లక్ష్మణరావును ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ కిషాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, బసవా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయం దివాస్ కార్యక్రమం నిర్వహించారు. 1999 జూలై 25న దేశం కోసం పాకిస్తాన్ ముష్కరులతో పోరాడి వీరమరణం పొందిన సైనికులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులు అర్పించారు.

అమలాపురం టౌన్: కార్గిల్ యుద్ధ పోరాట స్ఫూర్తిని ఈ దేశ చరిత్ర ఉన్నంత కాలం ప్రజలు మరిచిపోరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అమలాపురంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో జరిగిన విజయోత్సవ ర్యాలీ, సభలో దొరబాబు మాట్లాడారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర గౌడ్, ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు మానేపల్లి అయ్యాజీ వేమా, పాలూరి సత్యానందం, మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత సైనికులను సత్కరిస్తున్న గంగన్న స్వామినాయుడు, పవన్‌కుమార్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు


రవి దుర్గా గణేష్ (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం మండలం పేరూరు శివారు తోట్లపాలెంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. తోట్లపాలెం గ్రామానికి చెందిన దొంగ రవిదుర్గా గణేష్, గెద్దాడ ఓంసాయి కలిసి బైక్‌పై వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రవి దుర్గా గణేష్(26) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన ఓంసాయిని ఆస్పత్రికి తరలించారు. అతివేగంతో వెళుతున్న వీరి మోటారుసైకిల్ రోడ్డు ఎడ్జి వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. వీరిద్దరూ స్నేహితులు. ఇంకా పెళ్లి కాలేదు. తోటి స్నేహితుడు కన్నుమూయడంతో ఓంసాయి కన్నీను మున్నీరయ్యాడు. మృతుడు రవిదుర్గా గణేష్ కూలి పనిచేసుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. చేతికంది వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబీకులు గుండెలవిసేలా విలపిస్తుస్తున్నారు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై జి.చంటి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురి అరెస్టు

ముమ్మిడివరం: కొత్తలంక శివారు పచ్చమట్ల వారిపాలెంలో పందులు పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. వారి నుంచి రూ.1800 నగదు, 7 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.